పూర్తికాదు.. వినియోగంలోకి రాదు

- పట్టణ ప్రజల సౌకర్యార్థం సమీకృత మార్కెట్
- రెండేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణ పనులు
- త్వరగా పూర్తి చేయాలంటున్న పట్టణ వాసులు
- వేగంగా విస్తరిస్తున్న జమ్మికుంట మున్సిపల్ పరిధి



కూరగాయల మార్కెట్

జమ్మికుంట: మున్సిపల్ పరిధి దినదినం వేగంగా విస్తరిస్తోంది. ఆధునిక హంగులతో పట్టణ ప్రజల సౌకర్యాల కోసం సమీకృత(ఇంటిగ్రేటెడ్) మార్కెట్ ఏర్పాటుకు మున్సిపల్ పాలకవర్గం ముందడుగు వేసింది. పాత కూరగాయల మార్కెట్ స్థలంలో రూ.1.40 కోట్లతో కూరగాయల మార్కెట్ నిర్మించి ప్రారంభించారు. కానీ అన్నిరకాల కూరగాయలు, మటన్, చికెన్, ఫిష్ లభించేలా సమీకృత మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యం నెరవేరడం లేదు. కూరగాయల కొనుగోలుకు ప్రజలు రావడం లేదని, వ్యాపారులు రోడ్లపైనే కూరగాయల అమ్మకాలు సాగిస్తున్నారు. వేగవంతం చేయాల్సిన సమీకృత మార్కెట్ పనులు రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. పనులు త్వరగా పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రూ.3 కోట్ల వ్యయంతో..

జమ్మికుంట పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్‌లోని రెండెకారాల స్థలాన్ని మార్కెట్‌శాఖ ద్వారా ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ స్థలంలో రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపడుతోంది. సుమారు 20 గదులతో సమీకృత మార్కెట్ నిర్మించనున్నామని, 12 రోడ్ల కూడళ్లతో ప్రజలకు సౌకర్యంగా పట్టణ నడిబోడ్డున నిర్మా ణం చేపడుతున్నామని 2021లో శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం నెమ్మదిగా కొనసాగుతున్నాయి.

రూ.1.40 కోట్లతో కూరగాయల మార్కెట్..

పాత వ్యవసాయ మార్కెట్ స్థలంలో రూ. 1.40 కోట్లతో కూరగాయల మార్కెట్ వినియోగంలోకి వచ్చింది. మండల పరిధిలోని కూరగాయలు పండించే రైతులు, హోల్‌సెల్, రిటైల్ వ్యాపారులకు స్థలాలు కేటాయించారు. మార్కెట్ నిర్వహణ కొనసాగుతుంది. క్రమక్రమంగా పట్టణ ప్రజలు కొత్త కూరగాయల మార్కెట్‌కు కొనుగోళ్లకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తయితే ప్రజలకు మరింత సౌకర్యంగా ఉంటుంది.


అసంపూర్తిగా సమీకృత మార్కెట్

వసతులు కల్పించాలి



సమీకృత మార్కెట్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి. ప్రజలు, కూరగాయల వ్యాపారస్తులకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలి. వ్యాపారులపై ఆర్థిక భారం వేయకుండా సౌకర్యంగా ఉండేలా ఏర్పాటు చేయాలి.

– వాసు వడ్లూరి, జనతాదళ్ (సెక్యూలర్) పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

నెలరోజుల్లో అందుబాటులోకి



సమీకృత మార్కెట్ పనులు ఇప్పటి వరకు 80 శాతం పూర్తి చేశాం. పట్టణ జనాభా పెరుగుతున్న క్రమంలో ప్రజల సౌకర్యం కోసం నిర్మాణం చేపడుతున్నాం. నెలరోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– బి. శ్రీనివాస్, కమిషనర్ జమ్మికుంట

క్లుప్తంగా

గురుకులంలో స్వాగతోత్సవం

చొప్పదండి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో మంగళవారం స్వాగతోత్సవం నిర్వహించారు. ఐదో తరగతితో పాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎల్ స్వాతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సంబోజి శేఖర్, వెంకటేశ్, శంకర్, విజయ, అజయ్, లికిత, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


సన్మానిస్తున్న మీ సేవా కేంద్రాల నిర్వాహకులు

రామడుగు: తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్‌ను మంగళవారం మండలంలోని మీ సేవా కేంద్రాల నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మీ సేవ కేంద్రాలలో దరఖాస్తులను పూర్తి సమాచారంతో అప్‌లోడ్ చేసి పంపించాలని సూచించారు. అలా చేస్తే ఎలాంటి ఇబ్బందిల్లేకుండా ధ్రువీకరణ పత్రాలను అందజేసే అవకాశం ఉంటుందని సూచించారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌కు..

చొప్పదండి: పట్టణానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్‌ను తెలంగాణ విద్యా చైతన్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో ఘనంగా సన్మానించారు. తెలంగాణ గౌడ ఉద్యమకారులకు సన్మానంలో భాగంగా చొప్పదండి నియోజకవర్గం నుంచి చంద్రశేఖర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణగౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, సుడా డైరెక్టర్ మంద రమేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన సమ్మెట విజయ కుటుంబాన్ని మంగళవారం ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ. ఐదువేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సదానందం, రమేశ్, రాకేశ్, సంపత్, అశోక్, చంద్రమౌళి ఉన్నారు.

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామానికి చెందిన కాల్వ కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. జంగపల్లి గల్ఫ్ సేవా సమితి అధ్యక్షుడు రంగు కనకయ్య ఆదేశాల మేరకు సభ్యులు మంగళవారం కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా వారికి 50 కిలోల బియ్యం, నగదు అందజేశారు. కార్యక్రమంలో వంశీకృష్ణరెడ్డి, రమేశ్, చారి, రాపోలు చంద్రయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 పనులు పరిశీలన


వెలిచాల గ్రామంలో పర్యటిస్తున్న సునీల్

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పలు సంక్షేమ కార్యక్రమాలు, పనులను మంగళవారం ఇఫ్సాన్ సంస్థ ప్రతినిధి, ప్రత్యేకాధికారి సునీల్ పరిశీలించారు. మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు, తడి, పొడి చెత్త బుట్టల వినియోగం, తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీ పద్ధతులను పరిశీలించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ సమన్వయకర్త కిషన్‌స్వామి, వెంకటేశ్, సర్పంచ్ వీర్ల సరోజనప్రభాకర్‌రావు, ఉపసర్పంచ్ వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి అరుణ్, రమేశ్, వేణు, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు పలువురు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

శంకరపట్నం: మండలంలోని కల్వల గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేశామని వైద్యసిబ్బంది తెలిపారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భద్రయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి


జ్ఞాపిక అందిస్తున్న డీఐఈవో జగన్మోహన్ రెడ్డి

చొప్పదండి: ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో ఎంత ర్యాంకు వచ్చినా ఉచిత విద్య లభిస్తుందని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఐఈవో జగన్మోహన్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించారు. గత విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శరత్‌బాబు, ఉపన్యాసకులు లక్ష్మణ్ కుమార్, కనకయ్య, శ్రీనివాస్, రాజశేఖర్, రాజేశం, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


మురుగునీటిని తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

హుజూరాబాద్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని ఆరోవార్డులో కౌన్సిలర్ నల్ల లక్ష్మి ఆధ్వర్యంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఇంటి పరిసరాల్లో నిల్వనీటిలో దోమలు వృద్ధి చెందటం మూలంగా రోగాల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో నిల్వనీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పారిశుధ్య సిబ్బంది వార్డులో చెత్తాచెదారం తొలగించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. కిషన్ రావు, మెప్మా ఆర్పీలు, పారిశుధ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

హుజూరాబాద్ ఏసీపీ జీవన్ రెడ్డి

హుజూరాబాద్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హుజూరాబాద్ ఏసీపీ జీవన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో హుజూరాబాద్, జమ్మికుంట, సైదాపూర్, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లోని రౌడీషీటర్లతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. చట్టానికి లోబడి ప్రతి ఒక్కరూ జీవించాలని సూచించారు. క్షణికావేశానికి లోనై నేరాలకు పాల్పడొద్దని సూచించారు. సమావేశంలో సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

‘నేతన్నలపై కేసీఆర్‌కు దయలేదు’

శంకరపట్నం: రాష్ట్రంలో నేతన్నలపై కేసీఆర్ ప్రభుత్వానికి దయ, కనికరం లేదని, ఆత్మహత్యలను సర్కార్ చిన్నచూపు చూస్తోందని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాస సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మండలంలోని గద్దపాక గ్రామానికి చెందిన కళాకారుడు నామిని సుధాకర్ కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. నేతన్నల మరణ భృతిని రూ.5వేల నుంచి రూ.25 వేలకు పెంచి ప్రాణాలకు వెలకట్టడం ప్రభుత్వానికి ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నాయకత్వం, ప్రతిఘటన, పోరాటతత్వం లేకపోవడంతోనే సర్కార్ నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బాధిత కుటుంబాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్, ఎంపీ బండి సంజయ్ పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. సమితి ఆధ్వర్యంలో కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందించారు. ఈకార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్, నాయకులు కిషోర్, ఆకాశ్‌గౌడ్ పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అన్నప్రాసన, గ్రోత్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆరు నెలల పిల్లలకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అటికం శారధ, అంగన్‌వాడీ టీచర్ అటికం రజిత, ఆశా వర్కర్ లావణ్య, శ్యామల తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోతున్నవారిని ప్రభుత్వం ఆదుకోవాలి

గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు రోడ్డు విస్తరణలో భాగంగా నివాస గృహాలు కోల్పోతున్న వారికి ఇళ్లు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం భారంగా మారిందని, అలాంటి వారిని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి దేశరాజ్ అనిల్, యూత్ అధ్యక్షుడు అజయ్, మంగరావు అనిల్, శ్రీమాన్ సాయి, నవీన్, ముక్కెర అభిలాశ్, దేశరాజ్ వెంకటేశ్, రంగనవేణి అజయ్, రంగనవేణి శేఖర్, సంతోష్, గిరి పాల్గొన్నారు.

- **సంపద వనం పరిశీలన**

రామడుగు: ప్రభుత్వం చేపట్టిన కోటి మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్‌డీవో ఏపీడీ సంధ్యారాణి కోరారు. మండలంలోని చిప్పకుర్తి గ్రామంలో మంగళవారం సంపద వనాన్ని ఆమె పరిశీలించారు. మొక్కలు నాటేందుకు పూర్తి స్థాయిలో గుంతలు తీసి సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, ఏపీవో రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

- **సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం**

జమ్మికుంట: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) జూనియర్ కళాశాలో 2023–24 సంవత్సరం ఎంపీసీ –10, బైపీసీ–32 సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జమ్మికుంట ప్రిన్సిపల్ కుమారస్వామి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు కళాశాల పని వేళల్లో సంప్రదించాలని కోరారు. మండలంలోని గంద్రపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల)జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ మంజుల ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ ఎస్సీ–11, ఎస్సీసీ(స్పెషల్ కేటగిరీ)–1, ఎస్టీ–1, మైనార్టీ –1, బైపీసీలో ఎస్సీ–6, ఎస్సీసీ(స్పెషల్ కేటగిరీ)–1, బీసీ–1, ఓసీ–1, మైనార్టీ–1 ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు 24వ తేదీలోపు కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని కోరారు.

- **రంగస్థల కళాకారులకు కళాజ్యోతి అవార్డులు**

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల రంగస్థల కళాకారులకు గ్రామీణ కళాజ్యోతి అవార్డు దక్కింది. మంగళవారం కరీంనగర్‌లోని ఫిల్మ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ సునీల్‌రావు, నిర్వాహకులు కృపానందం, ప్రవీణ్ అవార్డులను కళాకారులకు అందించారు. రంగస్థల కళాప్రదర్శనలకు అవార్డు రావడం సంతోషంగా ఉందని చిగురుమామిడి మండల రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్ అన్నారు. మెమోంటో, సర్టిఫికేట్‌తో పాటు శాలువా కప్పి సన్మానించారని రాజ్‌కుమార్ తెలిపారు.

- **ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడిగా కిశోర్‌రెడ్డి**

మానకొండూర్: మానకొండూర్ నియోజకవర్గ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన మాడ కిశోర్‌రెడ్డిని నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామకానికి సహకరించిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కు కిషోర్ కృతజ్ఞతలు తెలిపారు.

- **అంబేడ్కర్ యువజన సంఘం ఇన్‌చార్జిగా సాగర్**

జమ్మికుంట: తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన రాచపల్లి సాగర్‌ను వ్యవస్థాపక అధ్యక్షుడు గజ్జల కాంతం సమక్షంలో జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మంగళవారం నియామక పత్రాన్ని అజయ్ అందజేశారు.

- **అధికారులను కలిసిన నాయకులు**

హుజూరాబాద్‌రూరల్: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్డీవో రాజు, ఏసీపీ జీవన్‌రెడ్డిని మంగళవారం జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యుడు తునికి సమ్మయ్య, శాలపల్లిఇందిరానగర్ గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు కొడుగూటి ప్రవీణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

మిత్రుడికి చేయూత


నగదు అందిస్తున్న క్లాస్‌మేట్స్

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బుర్ర హరీశ్‌కు(29) ఆపరేషన్ కోసం తోటి మిత్రులు రూ. 87వేల ఆర్థిక సాయం అందించారు. ఇటీవల హరీశ్ ద్విచక్రవాహనం పైనుంచి కిందపడటంతో ముక్కుకు గాయమైంది. ప్లాస్టిక్ సర్జరీ చేయాలని లేదంటే ప్రాణాపాయం ఉందని వైద్యులు చెప్పారు. హరీశ్‌కు ఇద్దరు పిల్లలు, పనిచేయనిదే పూటగడవని పరిస్థితి, దీంతో తోటి మిత్రులు సోషల్ మీడియాలో సాయం చేయాలని అర్థించారు. గ్రామస్తులు, ఇతరుల ద్వారా రూ. 62,000, క్లాస్‌మేట్స్ రూ.25,000 కుటుంబ సభ్యులకు అందించారు. సర్పంచ్ భవానిఅరుణ్‌కుమార్ సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో సందడి


పుష్పగుచ్ఛం అందిస్తున్న దేవేందర్ రెడ్డి, నాయకులు

తిమ్మాపూర్: బీఆర్‌ఎస్ మానకొండూర్ అభ్యర్థిగా మూడోసారి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు టికెట్ కేటాయించడంతో నియోజకర్గంలోని బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రజాప్రతినిధులు, నాయకులు తండోపతండాలుగా తిమ్మాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి మంగళవారం తరలివచ్చి రసమయికి శుభాకాంక్షలు తెలిపారు. గెలుపు కోసం పనిచేస్తామని హామీ ఇచ్చారు. క్యాంపు కార్యాలయం నాయకులతో సందడిగా మారింది. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ నాయిని వెంకట్ రెడ్డి, కిన్నెర సారయ్య నియోజవర్గ ప్రజాప్రతినిధులు నాయకులు రసమయి కి శుభాకాంక్షలు తెలిపారు.

గన్నేరువరం: ఎమ్మెల్యే రసమయిని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరి సురేశ్ సన్మానించారు. కార్యక్రమంలో యువజన విభాగం ప్రధాన కార్యదర్శి టెకు అనిల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పత్తి అంజీ, యూత్ మండల ఉపాధ్యక్షుడు సిరిగిరి తిరుపతి, సిరిగిరి అంజి, సిరిగిరి గంగరాజు, సిరిగిరి సురేశ్‌లు పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి విజయదుందుభి


ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీ రవీందర్, నాయకులు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి విజయదుందుభి మోగిస్తామని జెడ్పీటీసీ గీకురు రవీందర్ ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా రైతుబంధు కమిటీ సభ్యుడు కొంరయ్య, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రజితకృష్ణమాచారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కైలాసం, నాయకులు ఉన్నారు.

రామడుగు: చొప్పదండి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా రెండోసారి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు టికెట్ కేటాయించడంతో మండల కేంద్రంలో రవిశంకర్ అన్న గల్ఫ్ యువసేన ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యువసేన అధ్యక్షుడు రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా పని చేయాలి

జమ్మికుంట: రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అస్సాం రాష్ట్ర ఎమ్మెల్యే ధర్మేశ్వర్ కొన్వర్ పిలుపు నిచ్చారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో హౌజింగ్ బోర్డు కాలనీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు నివాసంలో ప్రవాస యోజనలో భాగంగా పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు.ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

మైనంపల్లి హన్మంతరావు దిష్టిబొమ్మ దహనం

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో మంగళవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. మంత్రి హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఎత్తున నినాదాలు చేశారు. హన్మంతరావును తక్షణం బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని హుజూరాబాద్ పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

వీణవంక: హన్మంతరావు వెంటనే మంత్రి హరీశ్‌రావుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు టీం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు అప్పని హరీశ్‌వర్మ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న హరీశ్‌రావుపై విమర్శలు చేయడం సిగ్గు చేటని, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఆధ్యాత్మికం

ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు


వెదిరలో దేవాలయాన్ని పరిశీలిస్తున్న రామానంద

రామడుగు: కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల్లో శ్రీ వేంకటేశ్వరస్వామిదేవాలయాల అభివృద్ధికి శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం రూ.5. 40 కోట్ల నిధులు మంజూరు చేసిందని టీటీడీ దేవస్థానం పరిశీలకులు డాక్టర్ రామానంద తెలిపారు. మండలంలోని వెదిర గ్రామం శ్రీ వేంకటేశ్వస్వామి దేవాలయంలో పలు అభివృద్ధి పనులకు రూ. పదిలక్షలు మంజూరు కాగా మంగళవారం దేవాలయాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... దేవాలయంలో ముఖ మండపంతో పాటు భజన మండలి భవనం దేవస్థానం నిధులతో నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజేందర్‌రావు, వీడీసీ నాగుల రాజశేఖర్ గౌడ్, పూజారి అంజయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం


హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న మహిళలు

చొప్పదండి: పట్టణంలోని పోచమ్మ గుడి వద్ద ఉన్న హనుమాన్ ఆలయంలో సాయి మహిళా సేవా సమితి సభ్యులు మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. శ్రావణ మాసం పురస్కరించుకొ ని సుమారు రెండు గంటల పాటు హనుమాన్ చాలీసా పారాయణం , భక్తి గీతాలు ఆలపించారు. స్థానిక భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899